# ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి

మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 16 : ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్‌కే జైన్, పూర్వాగార్గ్, జిల్లా పోలీసు పరిశీలకురాలు నేహా యాదవ్ అధికారులు, సిబ్బందికి సూచించారు. మేడ్చల్ సమీకృత కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన జిల్లా గ్రీవెన్స్ కమిటీ, ఎంసీఎంసీ మీడియా సెంటర్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రీవెన్స్ కమిటీ సభ్యుడు శ్రీనివాస్ మూర్తితో మాట్లాడారు. సీజ్ చేసిన నగదు, తిరిగి ఇచ్చిన మొత్తం.. తదితర వివరాలపై ఆరా తీశారు. అనంతరం స్టాటిక్ సర్వేలెన్స్, మీడియా సర్వేలెన్స్ బృందాల లైవ్ స్ట్రీమింగ్‌ను పరిశీలించారు. కంట్రోల్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. పలు సలహాలు, సూచనలు చేశారు. ఎలక్ట్రానిక్, సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ప్రకటనలు, పెయిడ్ న్యూస్, ఫేక్ న్యూస్.. తదితర వివరాలను తెలుసుకున్నారు. సామాజిక మాధ్యమాల్లో జరిగే కోడ్ ఉల్లంఘనలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. సామాజిక మాధ్యమ సెల్ చురుగ్గా పని చేస్తుందని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఇదే ఒరవడిని కొనసాగించాలన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా, లోకల్ చానళ్లలో వచ్చే రాజకీయ ప్రకటనలు, ప్రచారాల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని వారు సూచించారు.



కలెక్టరేట్‌లోని మీడియా సెంటర్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

## ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం

**ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్**

సిటీబ్యూరో, నవంబర్ 16(నమస్తే తెలంగాణ) : ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడంలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ అన్నారు. గురువారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మాస్టర్ ట్రైనర్స్‌కు ఎన్నికల అధికారి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలింగ్ విధులు సమర్థవంతంగా నిర్వహించేలా పీఓలకు మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ కల్పించాలని తెలిపారు. పోలింగ్‌పై పీఓలకు పూర్తి అవగాహన కల్పించాలని మాస్టర్ ట్రైనర్స్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వలపు వల.. చిక్కి విలవిల

- తీపి మాటలతో ఆకర్షించి.. నిలువునా దోచేసి..
- న్యూడ్ ఫొటోలు.. వీడియోలు రికార్డు చేసిన యువతి
- రూ.5 లక్షలు సమర్పించుకున్నా.. ఆగని వేధింపులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన హనీ ట్రాప్ బాధితుడు

వెంగళరావునగర్, నవంబర్ 16 : అందచందాలు.. కవ్వింపు మాటలతో ఆ యువకుడికి వలపు వల విసిరిందా యువతి. తీపి మాటలతో మత్తెక్కించి నిలువునా దోచేసింది. ఏకాంతంగా తీసుకున్న న్యూడ్ ఫొటోలు, వీడియోలతో బెదిరింపులకు పాల్పడి రూ.5 లక్షలు వసూలు చేసింది. పోలీసు కేసులతో భయపెట్టించి మరింతగా డబ్బు గుంజే ప్రయత్నం చేసిందా మాయలేడి. హనీట్రాప్‌లో చిక్కుకొని విలవిలలాడిన ఆ యువకుడు చివరికి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన ఓ యువకుడు (25) ఎస్‌ఆర్‌నగర్‌లో ఐటీ ఉద్యోగం చేస్తున్నాడు. ఏడాది కిందట కృష్ణానగర్‌లోని గది భాగస్వామ్యం కోసం ఓఎల్‌ఎక్స్‌లో ఓ ప్రకటనను పోస్ట్ చేశాడు. కవిత అనే మహిళ అతడిని సంప్రదించింది. రూమ్మేట్‌గా ఉంటానని చెప్పింది. అందమైన అమ్మాయి తన గదిలో భాగస్వామిగా ఉండబోతుందని పట్టరాని ఆనందంతో ఎగిరి గంతేశాడు. అందం.. అభినయంతో ఆ యువతి అతడిని కవ్వించింది. గదిలోనే కాదు.. గుండెలోనూ చోటి స్థానని ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. కొన్నాళ్లు గడిచిన తర్వాత ఆమె వ్యక్తిత్వం నచ్చక ఆ యువకుడు.. ఆమెను దూరంగా పెట్టసాగాడు. తన రూమ్‌లో నుంచి వెళ్లిపోవాలని చెప్పాడు. దీంతో ఆ యువతి అతడిపై కక్షగట్టింది. ఇద్దరూ కలిసి ఏకాంతంగా దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తానంటూ బెదిరింపులకు దిగింది. కోరిక తీర్చుకుని తనను మోసం చేశాడంటూ.. ఆ యువకుడిపై పలు పోలీసు స్టేషన్లతో పాటు.. షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేసింది. షీ టీమ్స్ పోలీసులు వీరిద్దరికీ కౌన్సెలింగ్ చేశారు. పరిహారంగా రూ.4.70 లక్షలను ఆమెకు సమర్పించుకున్నాడు. ఆ తర్వాత అతడి తల్లి ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేసి.. మరింత డబ్బు డిమాండ్ చేసింది. ఈనెల 13వ తేదీన వీరిద్దరూ మాట్లాడుకోవాలని నిర్ణయించుకున్నారు. అమీర్‌పేటలోని సారథి స్టూడియోలో కలుసుకున్నారు. ఆ సమయంలో యాక్టివా బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు అతడిపై దాడి చేశారు. ఆ యువతి కూడా రాయితో తలపై దాడి చేసింది. బాధితుడిని చికిత్స నిమిత్తం పోలీసులు అమీర్‌పేటలోని ఓ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మధురానగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.ఉదయ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## కూతురిపై లైంగిక దాడి.. 25 ఏండ్ల జైలు శిక్ష

**5వేల జరిమానా.. బాధిత బాలికకు 5 లక్షల నష్టపరిహారం**

నాంపల్లి కోర్టులు, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ) : బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో కన్న కూతురిపై లైంగికదాడికి పాల్పడిన ఓ వ్యక్తి (35)కి 25 ఏండ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ నాంపల్లిలోని పోక్సో ప్రత్యేక కోర్టు, 12వ అదనపు జిల్లా జడ్జి టి.అనిత గురువారం సంచలన తీర్పు వెల్లడించారు. అదే విధంగా.. బాధిత బాలికకు రూ.5 లక్షల నష్టపరిహారాన్ని అందించాలని తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.రాంరెడ్డి కథనం ప్రకారం.. 2022లో కూతురిపై జరిగిన లైంగిక దాడిపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి, ఆ తర్వాత దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణ చేపట్టింది. నిందితుడిపై నేరం రుజువు కావడంతో కోర్టు తీర్పును ప్రకటించింది.

# మహిళలను మోసం చేస్తున్న వ్యక్తి అరెస్ట్

**వివరాలను వెల్లడించిన ఏసీపీ రవీందర్**

సిటీబ్యూరో/కంటోన్మెంట్, నవంబర్ 16: మ్యాట్రీమోని వెబ్‌సైట్ పేరుతో మహిళలను మోసం చేయడమే గాకుండా.. నగలను కాజేస్తున్న నిందితుడిని మార్కెట్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి నగలు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. నార్త్ జోన్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహంకాళి ఏసీపీ రవీందర్ వివరాలను వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా నేదునూర్ గ్రామానికి చెందిన తుమ్మ మోహన్ రెడ్డి అలియాస్ శ్రీనాథ్(38) ప్రైవేట్ ఉద్యోగి. సులువుగా డబ్బు సంపాదించేందుకు మ్యాట్రీమోని పేరుతో అమాయక మహిళలు, యువతులను మోసం చేస్తున్నాడు. నిందితుడు భరత్ మాట్రీమోని పేరుతో నకిలీ వెబ్ సైట్‌ను క్రియేట్ చేశాడు. ఈ మ్యాట్రీమోని వెబ్‌సైట్ ద్వారా ఓ యువతి పరిచయమయ్యింది. ఈనెల 8వ తేదీన ఆ యువతిని సికింద్రాబాద్‌లోని ఓ లాడ్జికి రావాలని సూచించాడు.


నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారాన్ని మీడియాకు చూపిస్తున్న ఏసీపీ రవీందర్

అతడు చెప్పిన ప్రకారం ఆమె (బాధితురాలు) లాడ్జికి వెళ్లి శ్రీనాథన్‌ను కలిసింది. ఆమె బ్యాగు పక్కన బెట్టి.. బాత్రూంకు వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. కొద్ది సేపటి తర్వాత ఆమె వచ్చి చూడగా.. అక్కడ బ్యాగు కనిపించలేదు.. అతడు కూడా అదృశ్యమయ్యాడు. ఆ బ్యాగులో 27 తులాల బంగారు నగలున్నాయి. దీంతో బాధితురాలు మార్కెట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎట్టకేలకు నిందితుడిని పట్టుకున్నారు.

**నిందితుడి నేర చరిత్ర..**

నిందితుడిని విచారించగా పలు ఆసక్తి కరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. గతంలో కూడా నిందితుడు చాలా మంది యువతులను మోసం చేసినట్టు విచారణలో వెల్లడైంది. రంగారెడ్డి జిల్లాలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో నిందితుడు టీచర్‌గా పని చేసినట్టు పోలీసులు గుర్తించారు. 2011లో బాలికను వేధించిన కేసులో అరెస్టయిన నిందితుడు.. మూడు నెలల పాటు జైలుకు వెళ్లాడు. జైలు నుంచి విడుదలైన అతడు తిరిగి నేరాలు చేయడం మొదలుపెట్టాడు. నిందితుడిపై తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా కేసులు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. చాలా కాలంగా నేరాలు చేస్తున్న నిందితుడిని మార్కెట్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి సెల్‌ఫోన్, 27 తులాల బంగారు నగలు, కోటక్ మహీంద్రా చెక్ బుక్, హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డు, జోయాలుక్కాస్, లలితా జ్యువెల్లరీ ఇన్వాయిస్ పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

## సిటీ పోలీసు కమిషనరేట్‌లో కోర్టు హాలు నిర్వహణ


- రౌడీషీటర్ల చేతిలో ప్రాణాలు కోల్పోయిన.. బాధిత కుటుంబాల బాధలను తెలుసుకోండి
- ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ హోదాలో డీసీపీలను ఆదేశించిన సీపీ సందీప్ శాండిల్య

సిటీబ్యూరో, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ హోదాలో నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో కోర్టు హాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వివాదాలను సీపీ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ హోదాలో విచారించారు. ఇందులో భాగంగా చిలకలగూడ పీఎస్ పరిధిలో ఒక మతపరమైన స్థలానికి సంబంధించిన వివాదంలో రెండు గ్రూపులను పిలిచి విచారించారు. మరో కేసులో కాలాపత్తర్ పీఎస్ పరిధిలో రెండు రౌడీ గ్యాంగ్‌ల మధ్య ఆధిపత్యపోరు నడుస్తోంది. ఇరు గ్రూపులను కోర్టు హాలుకు రప్పించి హెచ్చరించారు. ఇదే తరహా వివాదంలో చాంద్రాయణగుట్ట, బంజారాహిల్స్ ఠాణాల పరిధికి చెందిన మరో నాలుగు రౌడీ గ్రూపులను సైతం సీపీ తీవ్రంగా హెచ్చరించారు. అనంతరం సీపీ సందీప్ శాండిల్య మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే గ్రూపు తగాదాలను నివారించేందుకు సీఆర్‌పీసీ 107 సెక్షన్ చాలా శక్తివంతమైన ఆయుధమన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

**బాధితుల బాధలు స్వయంగా..**

గత ఐదేండ్లుగా రౌడీలు, గూండాల చేతిలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలను గుర్తించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా బాధితుల ఇండ్లకు వెళ్లి తెలుసుకోవాలని డీసీపీలను ఆదేశించారు. ఈ బాధ్యతలను మహిళా పోలీసు అధికారులకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. ఐసీసీసీ డీసీపీ పుష్ప, నార్త్‌జోన్ డీసీపీ చందనా దీప్తి, సీసీఎస్ డీసీపీ శిల్పవల్లి, టాస్క్‌ఫోర్స్ డీసీపీ నిఖితా పంత్, ఉమెన్‌సేఫ్టీ డీసీపీ దార కవిత, టీ-న్యాబ్ డీసీపీ డి.సునీతారెడ్డి, ఉమెన్ సేఫ్టీ ఏఈసీపీ ప్రసన్నలక్ష్మి తదితరులు రౌడీల చేతిలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలను సందర్శించనున్నారు.

## 1.8కిలోల బంగారం పట్టివేత



శంషాబాద్ రూరల్, నవంబర్ 16 : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఓ ప్రయాణికుడి వద్ద నుంచి డీఆర్‌ఐ అధికారులు 1.8 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన గురువారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో జరిగింది. అధికారుల కథనం ప్రకారం.. తిరుచిరాపల్లి నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఓ ప్రయాణికుడిపై నిఘా పెట్టిన డీఆర్‌ఐ అధికారులు.. అతడిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు. అతడి వద్ద నుంచి 1.8 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బంగారం విలువ రూ.1.11 కోట్లు ఉంటుందని వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

## ఎగ్జిట్ పోల్ సర్వే చేస్తున్న ఆరుగురి అరెస్టు

వెంగళరావునగర్, నవంబర్ 16: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటెవరికి వేస్తారని ఓటర్లను అడిగి ఎగ్జిట్ పోల్ సర్వే చేస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఓటర్ల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న స్మార్ట్ పొలిటికల్ ఎగ్జిట్ పోల్ సంస్థకు చెందిన ఉద్యోగులు విజయ్‌కుమార్, ఎన్‌వీఎన్‌ఎస్. మనోజ్, జితేందర్ కుమార్, జాకీర్ హుస్సేన్, లింగయ్య, వెంకట్‌ను పోలీసులు అరెస్టు చేసి, వారి వద్ద నుంచి మూడు డబ్బాలు, 300 సర్వే కాపీలను స్వాధీనం చేసుకున్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీఎస్పీ, ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు, నోటా.. ఎవరికి ఓటేస్తారని ఓటర్ల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ఎన్నికల సందర్భంగా ఇలా సర్వే చేయడం నిషేధం, చట్ట విరుద్ధంగా సర్వే చేస్తున్న వీరిపై జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి అభిషేక్ తివారీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## చాక్లెట్‌లో గంజాయి.. నిందితుడి అరెస్టు

వెంగళరావునగర్, నవంబర్ 16: గంజాయితో తయారు చేసిన చాక్లెట్లను విక్రయిస్తున్న నిందితుడిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్‌ఐ ఉదయ్ కథనం ప్రకారం.. ఫలక్‌నుమా శివాజీనగర్‌కు చెందిన కె.శ్రీకాంత్ (50) ఉత్తరప్రదేశ్ నుంచి ఆన్‌లైన్ ద్వారా గంజాయి చాక్లెట్లను దిగుమతి చేసుకుంటున్నాడు. వాటిని గుట్టుగా విక్రయిస్తున్నాడు. గంజాయి నుంచి హ్యాష్ ఆయిల్‌ను తీసి.. ఆ ఆయిల్‌తో గంజాయి చాక్లెట్లను తయారుచేస్తారని డీఎస్‌ఐ తెలిపారు. ఇదిలాఉండగా.. శ్రీకాంత్ బైక్‌పై తిరుగుతూ చాక్లెట్లు విక్రయించే ప్రయత్నం చేస్తుండగా.. యూసుఫ్‌గూడ జానకమ్మ తోట వద్ద పోలీసులకు చిక్కాడు. నిందితుడు శ్రీకాంత్ వద్ద నుంచి 30 కిలోల గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.